

పేదవాడికి మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - కడియం



ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న చందన

పేదవాడికి మెరుగైన వైద్య సేవలందించే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకూ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని వీరవరం కమ్యూనిటీ హాల్లో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం సర్పంచ్ బివిఎల్ఎన్ జయంతి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, ఎంపిడిఓ రత్నకుమారి, కొత్తపల్లి రాము, మక్కపాటి రాంబాబు, చందన షణ్ముఖరావు, బాదంపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

2023 స్మృతి కవనం...

కొంత ఖేదం.. కొంత మోదం.. సుఖసంతోషాలు, కష్టనష్టాలతో ఈ ఏడాది మరో కొన్ని గంటల్లో కాలగమనంలో కలిసిపోనుంది. మంచిచెడులను మనకే వదిలేసి మాయమైపోనుంది. జరిగిన తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకుని మంచిగా జీవించాలనే సందేశాన్నిచ్చింది. ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసింది. రాజకీయ మార్పులకు వేదికైంది. ఎన్నో స్మృతులను తనలో నిక్షిప్తం చేసుకుంది. ఆ స్మృతుల కవనం ఒకసారి మననం కోసం...

జనవరి 2023



సిఐటియు చైతన్య ర్యాలీ

1న సిఐటియు కార్మిక చైతన్య ర్యాలీ ఆదివారం తూర్పుగోదావరి జిల్లాలో ప్రవేశించింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద కాటన్ విగ్రహానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు, అఖిలభారత ఉపాధ్యక్షులు బేబిరాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల సభల్లో వారు మాట్లాడారు.

2న సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాజమహేంద్రవరం పర్యటించారు. పెన్షన్ పెంపును లాంఛనంగా ప్రారంభించారు.

9న పరంపర అక్రమాలపై ఎపి పేపరు మిల్లు ఎదుట కార్మికులు గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. పంపుహౌస్‌ను అద్దెకివ్వటంతో పేపరు మిల్లు యాజమాన్యం మధ్యాహ్నం తర్వాత తాత్కాలికంగా ఉత్పత్తి నిలిపివేసింది.

22న కాకినాడకు చెందిన డాక్టర్ చంద్రశేఖర్‌పద్మ పురస్కారానికి ఎంపికయ్యారు.

ఫిబ్రవరి 2023



బాలోత్సవం

6న సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు కదం తొక్కారు. . కాకినాడ జిల్లా జెడ్‌పి సెంటర్ వద్ద జరిగిన మహాధర్నాకు వేలాది మంది అంగన్‌వాడీలు తరలి వచ్చారు.సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి మాట్లాడారు. రాజమహేంద్రవరంలో పోలీసులు, అంగన్‌వాడీల మధ్య తోపులాట చోటు చేసుకుంది

9నపె.రాగంపేట గ్రామంలో నిర్వహిస్తున్న అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ కంపెనీకి చెందిన పరిశ్రమలో ఆయిల్ ట్యాంకర్ క్లీన్ చేయడానికి దిగి ఊపిరి ఆడక ఏడుగురు కార్మికులు మృతి చెందారు.

15న కాకినాడలో ఒమెన్స్‌హాకీ జాతీయ పోటీలు ప్రారంభమయ్యాయి.

16న ఉమ్మడి జిల్లాలో చంద్రబాబు పర్యటించారు. అనపర్తి వద్ద ఆయన రోడ్‌షోను పోలీసులు అడ్డుకోవటంతో ఉద్రిక్తత నెలకొంది

25న రాజమహేంద్రవరంలో గోదావరి బాలోత్సవం జరిగింది. పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు.

మార్చి 2023



పరామర్శ

4న గన్నవరం ఘటనల నేపథ్యంలో టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌తో పాటు మరో 13 మంది రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు.

5న టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి మాజీ చైర్మన్ వరుపుల రాజా గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. టిడిపి అధినేత చంద్రాబు ఆయన భౌతికకాయాన్ని సందర్శించారు.

19న 'చలో విజయవాడ' నేపథ్యంలో తూర్పుగోదావరి సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్, ఐద్వా జిల్లా కార్యదర్శి టి.తులసి, సిఐటియు నాయకులను గృహనిర్బంధం చేశారు.

20న అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల పోలీసులు వైఖరిని నిరసిస్తూ కాకినాడలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

ఏప్రిల్ 2023



వసంతకుమార్‌కు నాయకుల నివాళి

5న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీ జిల్లా అమలాపురంలో సైకో వీరంగం సృష్టించాడు. ఇద్దరు మహిళలపై చాకుతో దాడి చేశారు. గొంతు కోయడంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

18న కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెంలో బయోడీజిల్ ట్యాంకులోకి దిగిన ఇద్దరు కార్మికులు ఊపిరాడక మృతి చెందారు.

21న కెవిపిఎస్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి, ప్రజా సంఘాల నాయకుడు పచ్చిమాల వసంత కుమార్ (52) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మతి చెందారు.

30న రాజమహేంద్రవరంలో మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవానీ భర్త ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు

మే 2023



వర్షార్పణం

1న కురిసిన అకాల వర్షాలతో వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. సుమారు 90వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా వేశారు.

4న రామచంద్రపురం, మండపేటల్లో పాడైన పంటలను టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పరిశీలించారు. ఆయన పర్యటన రెండు రోజుల పాటు సాగింది.

10న కోనసీమ జిల్లాలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పర్యటించారు. 11న రైతు ప్రతినిధులతో భేటీ అయ్యారు.

14న తాళ్లరేవు మండలం కోరంగిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు.

27న రాజమహేంద్రవరం రూరల్ వేమగిరిలో టిడిపి మహానాడు జరిగింది. టిడిపి జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 28న బహిరంగ సభలో మినీ మేనిఫెస్టో ప్రకటించారు.

జూన్ 2023



వారాహి యాత్ర

12న తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలోని అనంతపల్లి వద్ద జిరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. వీరిలో ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన వారితోపాటు, చాగల్లు మండలం ఊనిగట్ల, పోలవరం మండలం ఎన్ఎన్‌డి పేటకు చెందిన వారు ఉన్నారు.

14న సత్యనారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం పవన్‌కళ్యాణ్ వారాహి యాత్రను ప్రారంభించారు. కత్తిపూడిలో బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. 20వరకూ కాకినాడ జిల్లాలో ఆయన యాత్ర సాగింది. అనంతరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రవేశించింది. 25న కోనసీమ జిల్లాలో యాత్ర ముగిసింది.

29న కాకినాడలో బ్రెయిన్ డెడ్ అయిన ఒక మహిళ మూత్రపిండాన్ని గ్రీన్ ఛానల్‌లో విశాఖకు తరలించారు.

జులై 2023



వరద పోటు

1న అంగన్‌వాడీల పోరు యాత్ర రాజమహేంద్రవరం చేరుకుంది. కోటిపల్లి బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ మాట్లాడారు.

2న గోకవరం మండలం తిరుమలాయపాలెం ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని సమగ్ర విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేయాలని దళిత, గిరిజన ప్రజాసంఘాల నాయకులు హోమ్ మంత్రి తానేటి వనితను కలిసి వినతిపత్రం అందజేశారు.

11న తమ సమస్యలు పరిష్కరించాలని రాజమహేంద్రవరం సబ్ కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు 36 గంటల మహాధర్నా నిర్వహించారు.

12న రాజమహేంద్రవరంలో మహా ర్యాలీ నిర్వహించారు.

23న గోదావరి ఉధృతితో అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 30కి పైగా లంకగ్రామాలు ముంపు బారిన పడ్డాయి.

28న మరోమారు వరదలు ముంచెత్తాయి

ఆగస్టు 2023



ఎస్ఎఫ్ఐ సైకిల్ ర్యాలీ

4న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని విద్యుత్ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.


8న సిఎం జగన్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇదే రోజు తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి, దేవరపల్లి, గోపాలపురంలో టిడిపి అధినేత చంద్రబాబు పర్యటించారు. 8న కోనసీమ జిల్లాలో పర్యటించారు.

12న సిఎం జగన్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించారు. అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు.

16న చంద్రబాబు రాజమండ్రి వచ్చారు. 17 నుంచి 3 రోజులపాటు చంద్రబాబు కోనసీమ పర్యటించారు. రావులపాలెం, అమలాపురం బహిరంగ సభలో మాట్లాడారు.

22న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సైకిల్ యాత్ర నిర్వహించారు. ఎంఎల్‌సి ఐవి పాల్గొన్నారు.

సెప్టెంబర్ 2023



రిమాండ్ ఖైదీ

2న టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర తూర్పు గోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. గోపాలపురం, నల్లజర్ల, దేవరపల్లిలో ఆయన యాత్ర సాగింది.

3న టిడిపి అధినేత చంద్రబాబు కాకినాడ జిల్లా అచ్చంపేటలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని 36 నియోజకవర్గాల ఇన్‌చార్జిల సమావేశంలో పాల్గొన్నారు. టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నల్లజర్ల నుంచి యువగళం పాదయాత్రను ప్రారంభించారు.

9న టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర కోనసీమ జిల్లా మలికిపురంలోకి ప్రవేశించింది. 10న చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి శ్రేణుల ఆందోళనలు నిర్వహించాయి.

11న టిడిపి అధినేత చంద్రబాబును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు రిమాండ్ నిమిత్తం అర్ధరాత్రి తరలించారు. దీంతో నగరంలో హై ఎలర్ట్ ప్రకటించారు. యువగళం యాత్ర నిలిచింది.

అక్టోబర్ 2023



గృహ ప్రవేశం

2న ధవళేశ్వరం, రాజమహేంద్రవరం, కొవ్వూరుల్లో ప్రజాసంఘాల నాయకుల ఇళ్లల్లో ఎన్ఐఎ తనిఖీలు నిర్వహించింది.

4న రాజమహేంద్రవరంలో రాష్ట్ర నిరుద్యోగసదస్సు జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


6న సిపిఎం రాష్ట్ర వర్కుషాపు రివర్‌బే హోటల్‌లో ప్రారంభమైంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

11న యానిమేటర్లు సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టరేట్ల వద్ద ఆందోళనకు దిగారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

12న సామర్లకోటలోని ఈటిసి, ప్రత్తిపాడు రోడ్డు లేఅవుట్లలో సామూహిక గృహప్రవేశాలను సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు.

31న రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు విడుదల అయ్యారు.

నవంబర్ 2023



ప్రజా రక్షణ భేరి

3న ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ జాతీయ సమావేశాలు శుక్రవారం కాకినాడలో ప్రారంభమయ్యాయి. సమైక్య జాతీయ అధ్యక్షుడు దెబాశేష్ బర్మన్ అధ్యక్షత వహించారు.

5న ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర తుని వద్ద కాకినాడ జిల్లాలో ప్రవేశించింది. 6న తూర్పుగోదావరి జిల్లా 7న కోనసీమ జిల్లాల్లో కొనసాగింది.

8న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు నిరసనగా బంద్ జరిగింది.

11న పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నాలు జరిగాయి.

27న నిలిచిన యువగళం పాదయాత్ర 79 రోజుల విరామం అనంతరం తిరిగి సోమవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం పొదలాడ నుంచి తిరిగి ప్రారంభమైంది.

డిసెంబర్ 2023



సాబ్జీ మరణం

2న యువగళం యాత్రం కాకినాడ జిల్లాలో ప్రవేశించింది. .4న మిచౌంగ్ తుపాను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను అతలాకుతలం చేసింది. భారీ, వర్షాలు ఈదురు గాలులకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

12 నుంచి అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెకు దిగారు. సమ్మెలో భాగంగా వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. వీరికి పలు ప్రజా, కార్మిక సంఘాలు, వామపక్షాలతో పాటు టిడిపి, జనసేన, కాంగ్రెస్ మద్దతు తెలిపాయి. 12న సమగ్రశిక్ష, 26న మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు.

15న పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

27 నుంచి 30వ వరకూ కాకినాడలో ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభ జరిగింది. అఖిల భారత నాయకులు హాజరయ్యారు.

షరతులు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



నూతన సంవత్సర వేడు కలను ఆనందోత్సవాల మధ్య జరుపు కోవాలని, అయితే ఎటువంటి సమస్య లు ఉత్పన్నం కాకుండా కొన్ని షరతు లను విధిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి పి.జగదీష్ ఓ ప్రకటనలో వెల్లడిం చారు. ముందుగా జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 31వ తేదీ రాత్రి ప్రతీ సెంటర్లోనూ పోలీసు బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవ్వరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. వేడుకలు మరియు సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు/మ్యూజిక్ సిస్టంలు ఉపయోగిం చదలిస్తే ముందుగా పోలీసుల నుంచి అధికారికంగా అనుమతి తీసుకోవా లన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఒంటి గంట వరకూ మాత్రమే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. ఈ వేడుకల్లో అశ్లీల నృత్యాలకు అవకాశం ఉండకూడదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిడం, మద్యం సేవించి వాహనాలను నడపడం వంటివి చేయరా దన్నారు. ఆకతాయిలు, మితిమీరి ప్రవర్తించే యువతను, రోడ్లపై చిందులు తొక్కే మందు బాబులును ఇష్టాను సారంగా వాహనాలను నడిపేవారిని చిత్రీకరించేందుకు వీడియో కెమేరాలు మరియు డిజిటల్ కెమేరాలు ఉపయోగిం చాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ వేడుక కార్యక్రమాలు నిర్వహించే వారు ప్రజలకు ప్రమాదం కలిగించే ఎటువంటి కార్యక్రమ మైన, విన్యాసమైన నిషిద్ధం, ప్రేలుడు పదార్థాలను వినియోగించడాన్ని పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. వాహనాలను అతి వేగంగా నడపడం, సైలెన్సర్ తీసి వాహనాన్ని నడపడం, హారన్ అదే పనిగా మోగించడం, రాంగ్ రూట్లలో డ్రైవ్ చేయడం, వాహనంపై విన్యాసాలు చేయడం, జిగ్ జాగ్ గా డ్రైవ్ చేయడం, ప్రమాదకరంగా వాహ నాలను నడప టం, ద్విచక్రవాహనాలపై ముగ్గురు ప్రయా ణించడం వంటి చర్యలను నిరోధిం చడానికి ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపి చట్ట ప్రకారము కేసులు నమోదు చేస్తామన్నారు. అన్ని ప్రార్థన మంది రాల వద్ద పోలీసు నిఘా, గస్తీ ఏర్పాటు చేస్తు న్నామని, నిర్ణీత సమయంలో ప్రార్థనలు ముగుంచుకోవాల న్నారు. బహిరంగ ప్రదేశాలు, జంక్షన్‌లలో కేకులు కట్ చేయడము నిషేధ మన్నారు. ఏ వ్యక్తి అయినా హద్దు మీరి ప్రవర్తించిన, ప్రభుత్వ నిబంధనలు పాటించక పోయినా వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి జగదీష్ హెచ్చరించారు.

మానవ ఆరోగ్యానికి మిల్లెట్స్ దోహదం

ప్రజాశక్తి - రాజానగరం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వివిధ యూనివర్శిటీల వీసీలు

నేటి ఆధునిక సమాజంలో మానవునికి ఆరోగ్య కరమైన ఆహారం మిల్లెట్స్ ద్వారానే సాధ్యమని పలువురు అభిప్రాయ పడ్డారు. ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిలెట్స్ - 2023 సందర్భంగా గోదావరి రిజినల్ క్లస్టర్ గ్రూప్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ సహకా రంతో నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శనివారం 'మిల్లెట్స్ ఫర్ హెల్త్ అండ్ ఎంట్రప్రెన్యూర్ షిప్' వర్క్ షాప్ ప్రారంభం అయ్యింది. ఈ సందర్భంగా నన్నయ యూనివర్సిటీ విసి ఆచార్య కె.పద్మరాజు, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ డాక్టర్ తోలేటి జానకిరామ్, జెఎన్‌టియుకె విసి ఆచార్య జివిఆర్.ప్రసాదరాజు, ఆయా యూనివర్శిటీల రిజిస్ట్రార్లు ఆచార్య జి.సుధాకర్, డాక్టర్ బి.శ్రీనివాసులు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.పి.విజయనిర్మల మాట్లాడారు. భారతదేశంలోని వాతావరణ పరిస్థితులు కారణంగా ప్రపంచానికి మనదేశం ఆహారాన్ని అందిస్తుందని అభిప్రాయపడ్డారు. మిల్లెట్స్ ఒకప్పుడు పేదవాడి ఆహారంగా ఉండేదని, నేటి ఆధునిక కాలంలో అందరికీ అవసరమైన ఆరోగ్యకరమైన ఆహారంగా మారిందన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ మిల్లెట్స్‌ను ఉత్పత్తి చేసే దేశమని వివరించారు. మానవ ఆరోగ్యానికి మిల్లెట్స్ ఎంతో దోహదపడతాయని, ముఖ్యంగా మహిళల ఆరోగ్యానికి ఎంతో అవసరమని చెప్పారు. రాష్ట్రంలో గోదావరి రీజనల్ క్లస్టర్ గ్రూప్ చాలా స్ట్రాంగ్‌గా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. నేటి ఆధునిక కాలంలో ప్రజలు ఎక్కువగా మిల్లెట్స్‌పై దృష్టి సారిస్తున్నారని చెప్పారు. మిల్లెట్స్ మిగిలిన పంటలతో పోల్చితే తక్కువ నీటితో పంట పడుతుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా ఉద్యాన తాలి మెను వంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని సమాజానికి అందిస్తున్నామని చెప్పారు. మిల్లెట్స్ తో వివిధ రకాల వంటకాలను తయారు చేస్తున్నారని అన్నారు. మిల్లెట్స్‌ను ఎంట్రప్రెన్యూర్ షిప్ స్టాట్ అప్ ప్రోగ్రామ్స్‌గా మార్చుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాల న్నారు.ఐఐఎంఆర్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ సి.తార సత్యవతి ఆన్‌లైన్ ద్వారా మిలెట్స్ యొక్క ప్రాధాన్యతను, ఆరోగ్యపరమైన ఆహారపు అలవాట్లను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కరుణశ్రీ, డాక్టర్ పద్మావతి, ఆచార్య మోహనరావు, డాక్టర్ వల్లి, డాక్టర్ సలోమి సునీత, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరితాడు బిగించుకుని నిరసన

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్



ఉరితాళ్లు బిగించుకుని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు మెడకు ఉరి తాడు బిగించుకుని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరవధిక సమ్మె శనివారానికి 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్ బాబు మాట్లాడుతూ గత ఐదు రోజులుగా శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వంలో ఎటువంటి స్పందన రావడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని వీడి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజన్న, అప్పారావు, సుధీర్, కిషోర్, ప్రేమ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందించిన పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి - గోకవరం



మృతిడి బంధువును ఓదార్చుతున్న పవన్ కల్యాణ్

మండలంలోని తంటి కొండ గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు అమర సూర్య భాస్కర రావు 3 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సూర్యభాస్కరరావు పేరుతో జనసేన పార్టీ చేసిన ఇన్సూరెన్స్‌లో వచ్చిన రూ.5 లక్షల బీమా చెక్కును శుక్రవారం ఆయన కుటుంబానికి జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాఠంశెట్టి సూర్యచంద్రం, దోసపాటి సుబ్బారావు, బజన రాజేష్ పాల్గొన్నారు.

సమస్యల వలయంలో విఆర్ఎలు

- నాలుగున్నరేళ్లుగా అమలు కాని హామీలు
- గతంలో అమలు చేసిన డిఎ సైతం తిరిగి వసూలు
- చలో విజయవాడకు సిద్ధమవుతున్న విఆర్ఎలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గ్రామాల్లో కొద్దిపాటి వేతనాలతో విఆర్ఎలు సమస్యల వలయంలో విధులు నిర్వహిస్తున్నారు. పార్టటైం పేరుతో ప్రభుత్వం వారితో ఫుల్‌టైమ్ పని చేయించు కుంటుంది. మరోవైపు ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవటంతో విధుల్లో ఉన్న వారిపై పని ఒత్తిడి పెరుగుతోంది. ప్రభుత్వం ఎప్పటికైనా తమ సేవలను గుర్తిస్తుందని ఎదురు చూసిన విఆర్ఎలకు నిరాశే మిగిలింది. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గౌరవ వేతనం బదులుగా కనీస వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారు. కనీస వేతనాలు అమలు చేయకపోగా గత ప్రభుత్వం అమలు చేసిన డిఎ రికవరీ చేసి ప్రభుత్వం వారి పట్ల కఠిన వైఖరి అవలంబించింది. గత ప్రభుత్వం 2018లో విఆర్ఎలకు జీతాలు పెంచడంతోపాటు డిఎ కూడా మంజూరు చేసింది. గత ప్రభుత్వం జారీ చేసిన జీవోలో తప్పు ఉందని, అందువల్ల అదనంగా వేతనం తీసుకున్నారని సాకుగా చూపెడుతూ డిఎను రికవరీ చేసింది. నాలుగున్నరేళ్లుగా వివిధ రూపాలలో నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వం స్పందించ లేదు. ఈ నేపథ్యంలో జనవరి 5న ఛలో విజయవాడకు సిద్ధమవుతున్నారు. మరోవైపు పని ఒత్తిడి పెరుగుతోంది. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవటంతో పాటు, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీ సర్వే పనుల్లోనూ కీలకంగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం 6 గంటలకు విధులకు హాజరైతే తిరిగి ఇంటికి చేరేసరికి రాత్రి 8 గంటలు దాటుతోందని విఆర్ఎలు వాపోతున్నారు. దీనికితోడు విధి నిర్వహణలోనూ అక్రమార్కులు తమను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేయటం పరిపాటిగా మారింది. విఆర్ఎలకు రక్షణ కల్పించటంతో పాటు, గౌరవ వేతనం బదులుగా కనీస వేతనం ఇస్తామని ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రకటించారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లలో ఆ హామీల అమలుకు నోచుకోలేదు. డిఎ రికవరీ చేయటం ప్రభుత్వ చిత్తశుద్ధి లేమికి నిదర్శనంగా నిలుస్తోంది.

చలో విజయవాడ విజయవంతం చేయాలి

ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు నేపథ్యంలో జనవరి 5న నిర్వహించనున్న ఛలో విజయవాడ కార్యక్రమానికి విఆర్ఎలు కదలిరావాలి. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. మరోవైపు డిఎ సొమ్మును రికవరీ చేయటం గతంలో ఎన్నడూ లేదు. ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాము.

- ఎం. వెంకటరమణ, జిల్లా అధ్యక్షులు, విఆర్ఏ అసోసియేషన్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు బుట్టదాఖలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 2600 మంది గ్రామ రెవెన్యూ సహాయకులు(విఆర్ఎ)లు పని చేస్తున్నారు. ప్రభుత్వం కేవలం రూ.10,480 మాత్రమే వేతనం చెల్లిస్తోంది. గతేడాది డిఎ రికవరీలో భాగంగా మరుసటి నెల వేతనం విడుదల చేయాలంటే డిడిలు రూపంలో రూ.2,600 ప్రతి నెలా చెల్లించారు. ఒక్కొక్కరి నుంచి రూ.13,500 ప్రభుత్వం వసూలు

ఇవీ విఆర్ఎల డిమాండ్లు

తెలంగాణలో ఇస్తున్నట్లుగా పే స్కేల్ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ విఆర్ఎలుగా నియమించాలని కోరుతున్నారు. ఖాళీగా ఉన్న విఆర్ఓ, వాచ్‌మెన్, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్, జీప్ డ్రైవర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.500 డిఎను 2018 జూన్ నుంచి వేతనంతో కూడిన డిఎగా తక్షణమే చెల్లించాలని కోరుతున్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి



ఉద్యోగులకు మద్దతుగా మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం, గోకవరం

సమగ్రశిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలోకి విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్.పాలసీ అమలు చేయాలని మాజీ మంత్రి, టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కెఎస్.జవహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదురుగా ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేస్తున్న నిరసన శిబిరాన్ని ఆయన సందర్శించి, వారికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతమున్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని, కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి, మినిమం టైం స్కేల్ అమలు చేసి, వేతనాలు పెంచాలని ఆయన కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరుతున్న న్యాయపరమైన డిమాండ్లు టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్తామని, రాబోయే ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాలు పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే ఏడాది వంద రోజుల్లో టిడిపి అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే, సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చడానికి తమ వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు డిమాండ్లు సాధించే వరకు ఉద్యమాన్ని విరమించేది లేదని, ఉద్యమాన్ని ఉధృతం చేసి, ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటామని, జెఎసి నాయకులు ఎమ్.రఘునాథ్, డి.వంశికృష్ణంరాజు, ఆర్. వెంకట్రాజు, మిరపరాజు, వెంకట్‌లు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎపిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ ఉద్యోగుల సంఘ నేత కెఎస్‌పి.రావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగులు వి.నాగరాజు, నిర్మలజ్యోతి, చిట్టి, గంగభవాని, విజయ్, శివ, సాయి ప్రియాంక, సురేంద్ర, కుమారి, కుసుమ, వీరబాబు, సత్యనారాయణ, మాణిక్యాంబ, శిరీష, చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

గోకవరం యుటిఎఫ్ శాఖ మద్దతు

రాజమహేంద్రవరంలో డిఇఒ కార్యాలయం వద్ద ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు గోకవరం మండల యుటిఎఫ్ సంపూర్ణంగా మద్దతు తెలిపింది. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.నాగభూషణం మాట్లాడుతూ ఎస్ఎస్ఎ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతి నెల ఒకటో తేదీనిజీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే యుటిఎఫ్ గోకవరం మండల శాఖ అధ్యక్షులు ఆర్.హరినాథ్, ప్రధాన కార్యదర్శి పివిఎస్ఆర్.త్రిమూర్తులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల యుటిఎఫ్ శాఖ పక్షాన ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మెకు రూ.5 వేలు సాయాన్ని అందించారు.

హోంమంత్రి ఇంటి ముట్టడికి యత్నం

-శిబిరానికి వచ్చిన హోంమంత్రి వనిత -సిఎం ద్వారా శుభవార్త వింటారని హామీ



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

శాంతియుతంగా ఉద్యమాన్ని నిర్వహిస్తున్నా ప్రభు త్వం ఏమాత్రం స్పందించక పోవడంతో జనవరి 3న జిల్లా కలెక్టరేట్లను ముట్టడిస్తామని నాయకులు హెచ్చరించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన ధర్నాను నిర్వహించారు. అనంతరం మంత్రి ఇంటిని ముట్ట డించేందుకు అంగన్ వాడీలు సిద్ధమయ్యారు. అయితే పోలీ సులు అంగన్‌వాడీ నాయక త్వంతో చర్చించి మంత్రి తానేటి వనిత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తానే నిరసన శిబిరం వద్దకు వస్తానని హామీ ఇవ్వడంతో ఆర్‌డిఒ కార్యాలయం వద్దే ధర్నాను కొనసాగించారు. ఈ నేపథ్యంలోనే మంత్రి తానేటి వనిత శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో నిరసన శిబిరం వద్దకు చేరుకుని అంగన్‌వాడీల ప్రతినిధి బృందం ఇచ్చిన వినతిపత్రాన్ని స్వీకరించారు. సమస్యలను సిఎం జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని, త్వరలోనే మంచి శుభవార్త వింటారని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకత్వం మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే మీ ప్రభుత్వానికి పడుతుందని,ఇదే విధానంలో ప్రభుత్వం వ్యవహరిస్తే అంగన్‌వాడీల ఉద్యమ సత్తా ఏమిటో జగన్మోహన్ రెడ్డికి చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూని జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీరాణి, జిల్లా అధ్యక్షులు సిహెచ్.మాణిక్యాంబ, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సుందరబాబు, బి.రాజులోవ, యూనియన్ నాయకులు సిహెచ్.అన్నపూర్ణ, కె.శారద, కె.సునీత, ఎన్.రామలక్ష్మి, సిహెచ్ఎల్‌వి. పుష్పవతి, ఎం.మాలతి, తదితరులు పాల్గొన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మద్దతు ఇచ్చారు.

రేసులో ఉన్నాను...పార్టీదే తుది నిర్ణయం



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాబోయే ఎన్ని కలలో పోటీ చేసే రేసులో తాను ఉన్నానని, అయితే అధిష్టానం పోటీ చేయమంటే ఏ స్థానా నికైనా సిద్ధమేనని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ తెలిపారు. శనివారం నగరంలోని గన్నీస్ శుభమస్తు ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. చట్ట సభలో ఒక్కసారైనా అడుగు పెట్టాలని ఆశ అయితే ఉందని, అందుకోసమే 2019 ఎన్నికల సమయంలో చంద్ర బాబు దగ్గరకు వెళ్ళి చివరిసారిగా అడుగుతున్నానని, ఇకపై సీటు కోసం అడగబోనని స్పష్టం చేసినా తనకు అవ కాశం రాలేదని అన్నారు. కాబట్టి రాబోయే ఎన్నికల్లో సీటు తనకు కావా లని మాత్రం అధిష్టానాన్ని అడగబోనని, తన సీనియారిటీ, సేవలను గుర్తించి పోటీ చేయాలని కోరితే ఏ స్థానానికైనా చేయడానికి సిద్ధమని స్పష్టం చేశారు. రాజకీయాల్లో తనకు వచ్చిన పదవులను నిజాయితితో నిర్వర్తించానని, కోట్లు ఖర్చు పెట్టి రాజకీయాలు చేసే విధానం తనది కాదన్నారు. అయితే దేశ, విదేశాలలో ఉ న్న మిత్ర బృందం ఎన్ని కోట్లు ఖర్చు యినా భరించడానికి సంసిద్ధులుగా ఉన్నారని తెలిపారు. ధనమే ముఖ్యమనే రాజకీయాల కంటే తనకు ఆత్మా భిమానమే ప్రాముఖ్య మన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రానికి సమర్థవంతమైన అనుభవజ్ఞుడైన చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రి కాకపోతే భవిష్యత్తు తరాలకు తీవ్ర అన్యాయం చేసిన వారమవుతామని అన్నారు. ఒక దశలో రెండు పర్యాయాలు తనని పోటీ చేయ మని స్వయంగా పార్టీ అధినేత చంద్ర బాబు నాయుడు కోరారని, కానీ కొంత మంది నాయకులు తనను తప్పుకోమని సూచించడం వల్ల ఆనాడు పోటీ బరిలోంచి తప్పుకున్నట్లు చెప్పారు. తన విషయంలో చంద్రబాబు తప్పు లేదని అన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో 'మీట్ ది సైంటిస్ట్'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరం-2023ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ కళాశాల వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'మీట్ ది సైంటిస్ట్' కార్యక్రమం జరిగింది. పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి. మునిరత్నం ఈ కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా పాల్గొని 'చిరుధా న్యాలు: పోషకాహారంగా మేలైన మరియు వాతావరణాన్ని తట్టుకునే పంటలు' అనే అంశంపై సందేశాన్ని ఇచ్చారు. ప్రముఖంగా వినియోగించే తృణధాన్యాలు (బియ్యం, గోధుమలు మరియు మొక్కజొన్న)తో పోలిస్తే ఏడు చిన్న మిల్లెట్ల (ఫింగర్, ఫాక్స్టైల్, కోడో, బార్న్యార్డ్, లిటిల్, ప్రోసో, బ్రౌన్టాప్) వ్యవసాయ సంబంధమైన లక్షణాలు మరియు పోషక విలువల గురించి వివరించారు. అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండేందుకు చిరుధాన్యాలు రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని ఆయన సూచిం చారు. మధుమేహం వంటి శారీరక రుగ్మతలను నివారించడానికి మిల్లెట్ల ఎంతగానో దోహదం చేస్తాయ న్నారు. విద్యార్థులు జంక్ ఫుడ్ అల వాట్లకు దూరంగా ఉండాలని, ఫిట్నె స్ కలిగి ఉండేందుకు పౌష్టి కాహారం అధికంగా ఉండే మిల్లెట్ ఆధారిత ఆహారాన్ని తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎ. శ్రీనివాసరావు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25 ఓపెన్ ఇసుక రీచ్‌లకు అనుమతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా పరిధిలో గుర్తించబడిన 25 ఓపెన్ ఇసుక రీచ్‌లకు సంబంధించి అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత ఆదేశించారు.కొవ్వూరు డివిజన్ పరిధిలోని 3 ఓపెన్ ఇసుక ర్యాంపుల అనుమతులు డిసెంబర్ 7, 27తేదీలలో ముగిసిందని, కావున రాబోయే రెండు రోజుల లో క్లియరెన్స్ ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా కమిటీ ఆమోదం పొంది నూతనంగా ఇసి దరఖాస్తు చేసుకున్న రాజమహేంద్రవరం డివిజన్ లోని 4, కొవ్వూరు డివిజన్‌లోని 18 కి సంబంధించి 15 రోజుల్లో క్లియరెన్స్ చేయలని ఆదేశించారు. అక్రమ తవ్వకాలు జరిపే వారి విషయంలో కఠినంగా వ్యవహ రిస్తామని హెచ్చరించారు. భద్రత చర్యలలో భాగంగా బ్యారేజ్, వంతెన పరిసర ప్రాంతాల్లో 500 మీటర్ల వరకు ఎటువంటి ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఆయా ప్రాంతాల్లో బ్యారికేటింగ్‌లను ఏర్పాటు చేసి నియంత్రణ పద్ధతులు అమలు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి సమన్వయ శాఖలతో కమిటీ వేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో చేపట్ట వలసిన పనులను చేపట్టి నివేదిక అందచేయాలని ఆదేశించారు. జిల్లాలో కొత్తగా 5 ప్లస్ హెక్టార్ల ఇసుక ర్యాంపులకు సంబంధించి గుర్తించాలని, అందులో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ చేపట్టి 15 రోజుల్లో కార్యాచరణ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జెసి ఎన్.తేజ్ భరత్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశు తోష్ శ్రీవత్సవ, ట్రైనీ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, జిల్లా మైన్స్ అధికారి ఎమ్.సుబ్ర హ్మణ్యం, ఇరిగేషన్ ఇఇ, డిడి భూగర్భ జలాలు వై.శ్రీనివాస్, పోలీస్, సెబ్, డిపిఒ, రవాణా, ఇఇ గోదావరీ వాటర్ హెడ్స్, పర్యావరణ, మైన్స్ అధికారులు, ప్రతిమ ఇన్ఫ్రా స్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధులుపాల్గొన్నారు.

31న ఆస్తిపన్ను చెల్లింపునకు అవకాశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

2023-2024 రెండో అర్ధసంవత్సరం ఆస్థిపన్నుపై అపరాధ రుసుం లేకుండా చెల్లించు అవకాశం ఈ నెల 31తో ముగుస్తున్నందున ఆదివారం కూడా ఆస్తి పన్నులు చెల్లించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పన్ను చెల్లింపుదారులకు పిలుపునిచ్చారు.

విధులను అంకితభావంతో నిర్వహించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎన్నికలకు సంబంధించిన విధులన్నీ అంకితభావంతో నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఆనం కళాకేంద్రంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎటువంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర ప్రముఖమైనదని, పోలింగు బూతును గుర్తించడం దగ్గర నుంచి పోలింగ్ జరిగిన ఇవిఎంలు స్ట్రాంగు రూములో నిల్వ చేసేదాకా సెక్టోరల్ అధికారుల పని ఉంటుందని తెలిపారు. సెక్టోరల్ అధికారులు, పోలీస్ అధికారులు, బిఎల్ఎలు, సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే ఎన్నికల నిర్వహణ సజావుగా సాగుతుందని అన్నారు. సెక్టోరల్ అధికారులు ముందుగా వారికి సంబంధించి పోలింగ్ బూతులను పరిశీలించి అందు పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని సౌకర్యాలైన ఎలక్ట్రిసిటీ, మంచినీటి సరఫరా, అవసరమైన అన్ని ఉన్నవా లేవా అన్నది చూడాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషినల్ కమిషనర్ పిఎం.సత్యవేణి, ఎస్ఇ జి. పాండురంగారావు, డిప్యూటి కమిషనర్ జి.సాంబశివరావు, ఎంహెచ్ఒ డాక్టర్ ఎ.విన్నూత్న, తదితరులు పాల్గొన్నారు.

విద్య వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



ప్రాజెక్టును తిలకిస్తున్న నన్నయ రిజిస్ట్రార్

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని కొత్తపల్లి ఆదర్శ ఉన్నత పాఠశాలలో విద్య వైజ్ఞానిక ప్రదర్శన శనివారం ప్రారంభం అయ్యింది. కాకినాడ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎల్ఎన్.రవికుమార్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ప్రదర్శనలోఉపాధ్యాయ బృందం, విద్యార్థులు రూపొందించిన 106 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ సుధాకర్ పాల్గొని ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలోని గ్రామంలో ఇటువంటి ఫార్మసీ కళాశాలలను స్థాపించి విద్యార్థులకు ఫార్మసీ విద్యను అందించడం చాలా గొప్ప విషయం అన్నారు. కళాశాల డైరెక్టర్ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులు సమయం విలువ తెలుసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ప్రగళ్లపాటి కనకరాజు, కార్యదర్శి పి.నాగమణి, డైరెక్టర్ హారిక, ప్రవళిక, కళాశాల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాథ్, కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొని ప్రమాదంలో శనివారం ఒక వ్యక్తి మృతి చెందారు. వివరాలివి.. జొన్నాడ-మండపేట ఆర్‌అండ్‌బి రహదారిపై కొత్తూరు సెంటర్ దాటిన తర్వాత ఒఎన్‌జిసి రిగ్ దగ్గరికి వచ్చేసరికి రావులపాలెం నుంచి బైక్ పై స్వగ్రామం వెళ్తున్న వ్యక్తి కావేరి ట్రావెల్ బస్సు వెనకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మతి చెందినట్లు ఆలమూరు పోలీసులు తెలిపారు. అతని గండేపల్లి మండలం వీరంపాలెం చెందిన నక్కావీరన్న (29)గా గుర్తించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలో చెయ్యేరు పంచాయతీ శివారు ఉప్పు చెరువు కొబ్బరి తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని కాట్రేనికోన ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. పేకాటశిబిరంపై పోలీసులు దాడి చేసి రూ.32 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ట్రైనీ డిఎస్‌పి విష్ణు స్వరూప్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు.

అదే ప్రాంతంలో జరుగుతున్న పందుల పందేలపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ రెండు సంఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్రల లోడు లారీ బోల్తా

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం జాతీయ రహదారి జిఎస్ఎల్ మెడికల్ కళాశాల పెట్రోల్ బంక్ ఎదురుగా కర్రలలోడుతో వెలుతున్న లారీ శనివారం తెల్లవారుజామున తిరగపడింది. నర్సీపట్నం నుంచి రాజమహేంద్రవరంలో పేపర్ మిల్లుకు కర్రలలోడుతో వెలుతున్న లారీ వెనుక నుంచి వస్తున్న వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో లారీ డివైడర్ ఎక్కి రహదారిపై తిరగబడింది. కర్రలు రహదారికి అడ్డంగా పడడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో మెడికల్ కళాశాలకు సర్వీస్ రోడ్డు మీదుగా వాహనాలను మళ్లించారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

నాటుసారా విక్రయం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఇబి సిఐ డి.సుధా ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెల్లచింతలగూడెం గ్రామంలో కుక్కల సూర్య మోహనకృష్ణ అనే వ్యక్తి సారా అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బందితో కలిసి దాడి చేసి 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని మోహనకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే గతంలో సారా కేసుల్లో ఉన్న గుబ్బల సాయిబాబును తహశీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రామవరంలో రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగార్జున రాజు తెలిపిన వివరాలివి. జగ్గంపేట మండలం రంగవల్లి నగర్‌కు చెందిన గాడి లక్ష్మి (62) రామవరం వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో ఢీకొని వెళ్ళిపోయాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంపిపికి మాతృవియోగం



నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం ఎంపిపి ఉండవల్లి సత్య నారాయణ మాతృమూర్తి నాగరత్నం అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమె మృతితో మండలం లోని వాదాలకుంట గ్రామంలో విషాదఛాయలు అలు ముకున్నాయి. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, ఇతర ప్రముఖులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు.ఆయన స్వగృహానికి చేరుకుని నాగరత్నం పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'గాలికుంటు' నివారణ టీకాలు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని అన్ని గ్రామాల్లో వచ్చే ఏడాది జనవరి 2 నుంచి 31వ తేదీ వరకూ గాలి కుంటు వ్యాధి టీకాలు వేస్తున్నట్లు మండల పశు వైద్యశాఖ అధికారి యు.ముకేష్ తెలిపారు. మండల వ్యాప్తంగా సుమారుగా 12 వేల పశువులకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. గాలికుంటు వ్యాధి పశువుల్లో వైరస్ ద్వారా వ్యాప్తి చెంది వ్యాధి సోకిన పశువులు బలహీన పడడం, 104-108 డిగ్రీల జ్వరంతో నోరు, నాలుక వద్ద బొబ్బలు ఏర్పడి మేత మేయకపోవడం, చొంగ కార్చడం, గిట్టలు మధ్య పుండ్లు ఏర్పడడం వంటి లక్షణాలు చూపిస్తాయని తెలిపారు. 4 నెలల వయస్సు దాటిన ప్రతీ పశువుకు టీకాలు వేయించాలని సూచించారు.

రెడ్ క్రాస్ సొసైటీపై అవగాహన

ప్రజాశక్తి - కడియం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యురాలు డాక్టర్ మహాలక్ష్మి మాట్లాడుతూ సంస్థ విధులు, జూనియర్ రెడ్ క్రాస్ వాలంటీర్లు చేయు కార్యక్రమాల గురించి వివరించారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ వై.ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ ఆపద సమ యంలో జూనియర్ రెడ్ క్రాస్ వాలంటీర్లు సమాజంలో ఎలాంటి సేవలు అందించాలో వివరించారు. ఈ కార్య క్రమంలో రెడ్ క్రాస్ జీవితసభ్యులు, పిఎంపిల జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవా నందం, పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్ఎం.షేక్ రఫీద్దాన్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పాఠశాల రెడ్ క్రాస్ నోడల్ ఆఫీసర్ జి.సత్యనారాయణ, పాల్గొన్నారు.

యానాం వార్తలు

డ్రీమ్స్‌లో ఉత్సాహంగా న్యూయర్ వేడుకలు



ఆట పాటలతో నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - యానాం

యానాం డ్రీమ్స్ ఫౌండేషన్ ఉన్నత పాఠశాలలో శనివారం 2024 నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. వేడుకల సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. 2024 ప్లకార్డులు, బెలూన్లను ప్రదర్శించారు. విద్యార్థులచే ఏకో ఫ్రెండ్లీ గ్రీటింగ్స్ కార్డులను తయారు చేయించారు. పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల మేనేజర్ శేరు వర్మ, ప్రధానోపాధ్యాయిని మాధ్యూ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - యానాం

యానాం నుంచి ఆంధ్ర ప్రాంతానికి శుక్రవారం అర్ధరాత్రి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. యానాం నుంచి రూ.12,500 విలువైన 74 మద్యం బాటిళ్లను అంబేద్కర్ కోనసీమ జిల్లా, మురమళ్లకు చెందిన కట్టా గణేష్ బైకుపై తరలిస్తుండగా కనకాలపేట ఏటిగట్టు ప్రాంతంలో పట్టుకున్నామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితుని యానాం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు అప్పగించామన్నారు.

క్వారీ సెంటర్‌లో అంబేద్కర్ భవనం



ఎంపీతో భేటీ అయిన దళిత సంఘాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని క్వారీ మార్కెట్ సెంటర్లో మరో అద్భుత కట్టడాన్ని త్వరలో నిర్మించబో తున్నట్టు ఎంపి మార్గాని భరత్ రామ్ తెలిపారు. శనివారం దళిత, గిరిజన, ప్రజా సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. అంబేద్కర్ భవనాన్ని ఎక్కడ నిర్మించాలనే విషయమై చర్చించారు. ఆఖరికి క్వారీ మార్కెట్ సెంటర్‌లో భవన నిర్మాణానికి అనువైనదిగా గుర్తించినట్లు తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుతోపాటు పార్లమెంటు భవన నమూనాలో అన్ని హంగులతో చక్కని భవనాన్ని నిర్మిస్తానని తెలిపారు. ఈ ఈ సమావేశంలో ఆయా ప్రజా సంఘాలకు చెందిన నాయకులు అజ్జరపు వాసు, బర్రే కొండబాబు, ఎం.బాబ్జీ, తాళ్ళూరి బాబూ రాజేంద్రప్రసాద్, దాసి వెంకట్రావు, ఎల్‌వి.ప్రసాద్, విజ్జన మధు, పట్నాల ఏసు, పాల్గొన్నారు.